

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



## గర్జించని నలభైలు (తుది భాగం)

***"రావోయ్, ఇంద నిన్ననే మాకు బోలెడంత జంక్ మెయిల్ వచ్చింది. వీటిల్లోంచి "మనకి" ఉపయోగపడేవేవన్నా ఉంటే, కట్ చేసి, ఆ పక్కన బుట్టలో వేస్తూండు. నేను ఇప్పుడే అరగంటలో స్నానంచేసి వచ్చేస్తా"*** అన్నారు.

"మనకి" అంటే, "మీకా", "నాకా", "మనకిద్దరికీనా" అని అడుగుదామనుకున్నా. కానీ, ఆయన అప్పటికే బాత్రూంలో దూరి ధామ్మని తలుపేసేసుకున్నారు. ఇహ చూడండి మహాప్రభో, జుట్టు గోకే వాడు, లాన్ గోకే వాడు, అద్దాలు తుడిచే వాడు, పళ్ళు తెల్లగా చేసేవాడు, కుక్కల్ని ఆడించేవాడు, ఇలా..ఒహటేవిటి, కొన్ని వందల కూపన్లు కట్‌చేసీ, చేసీ, రెండు గెంటలు గడిచాయి. ఆయన బాత్రూం వదిలి రాలేదు. చివరికి పీల గొంతుతో పిలిచాను

***"ఏవండీ, ఉన్నారా.."*** అని.

లోపల్నించి సమాధానం వచ్చింది ***"వున్నా,వున్నా ఇంకొక్క టైల్ మిగిలిపోయింది, అది కూడా శుభ్రం చేసి, అప్పుడు స్నానం చేసి వస్తాను.."*** అని.

***"ఓరి దేవుడోయ్, ఈయన వళ్ళు కడుక్కుంటున్నారనుకున్నాను, బాత్రూం కడుగుతున్నారా, ఇంకా ఒక టైల్ రాయి మిగిలి ఉందా, నా ఓపికకి నిప్పెట్టా, ఈయనెప్పుడొచ్చేను, బడ్జెట్ ఎప్పుడు మాట్లాడేను, నేను సినిమా ఎప్పుడు తీసేను?"*** అని ఒక డ్రై ఏడుపు ఏడ్చి ,మళ్ళీ కూపన్లలో పడ్డా, విధి లేక. మామూలుగా అయితే, ఈ పాటికి వాళ్ళ ఆవిడ వచ్చి, కాఫీ అనో, టీ అనో, జంతికలనో అందించేవారు. ఇవ్వాళ ఎవ్వరూ కనపడ్డంలేదు ఇంట్లో, ఏం చేస్తాం, అన్నీ కలిసొచ్చాయి, అనుకుంటూ, చరఖా తిప్పే గాంధీగారిలా బుంగమూతెట్టుకుని, పనిలో పడ్డా.

మొత్తానికి మరో గెంట తరువాత. అంటే నేను వెళ్ళిన మూడు గెంటలకి ఆయన దిగివచ్చారు. ఆయనని చూసి, నామినేటెడ్ ఎంపీ మొదటిసారి రాజ్యసభలో అడుగుపెడుతునప్పుడు ఎంత సంబర పడతాడో, అంత సంబరపడ్డా.

ఆయనొచ్చి, ***"సారీనోయ్, కాస్త లేటయింది, రా, భోంచేస్తూ మాట్లాడుకుందాం"*** అని, ఒక చెంచా, ఒక ఫోర్కు, ఒక..టే గ్లాసు, ఇలా ఒకటొకటే డిష్ వాషర్ లోంచి తీసి, డైనింగుటేబుల్ మీద పెడుతున్నారు. అది పూర్తయ్యేసరికి మరో గెంటయింది. నేను కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి, టేబుల్ దెగ్గిర కూర్చున్నాను.

ఆయన నాకు వడ్డిస్తూంటే, పొద్దున్న తిన్న ఉప్మా వార్నింగ్ ఇచ్చింది. వెంఠనే ***"అబ్బే, వద్దండీ, ఆకలి లేదు,మీరు తినండి,"*** అనేసాను.

ఆయన భోజనం చేస్తూ మొదలెట్టారు ***" నీ కథ విని, బడ్జెట్ ఇస్తానన్నారు చూడు, ఆయన నిన్న ఫోను చేసారు ఇండియానించి'*** అని ఆగారు.

నేను టెన్షన్‌తో చఛ్ఛిపోతూ, కుర్చీలోంచి లేస్తున్నా. ***"కూర్చో, కూర్చో. ఆయన.బడ్జెట్ ఇవ్వడం కుదరదని చెప్పారు."*** అన్నారు, డెత్ కబురు కోల్డ్‌గా చెబుతూ. కుర్చీలోనే పడిపోయా. ఆయన తాపీగా పెరుగు అన్నం కూడా ముగించి, నా మొహమ్మీద నీళ్ళు జల్లి లేపి, సోఫాలో కూర్చోబెట్టారు. నా ప్రాణాలు అప్పటికే కళ్ళలోకి వచ్చాయి.

ఆయన మొదలెట్టారు. ***"నీకోసం ఒక పుస్తకం కొన్నానోయ్. డబ్బుల్లేకుండా సినిమా తియ్యడం ఎలా? అని, నా లైబ్రరీలో ఉంది, పద వెతుకుదాం."*** అని బేస్మెంట్‌లోకి తీసుకెళ్ళారు.

అక్కడోరెండు గెంటలు వెతికాకా, ఆ గుర్తొచ్చింది, ఆ పుస్తకం నా కారులో ఉంది. అనుకుంటూ, బైటికెళ్ళి తెచ్చిచ్చారు. ఇంతలో వాళ్ళావిడ ఫోనొచ్చింది. ***"ఆ, ఇక్కడే ఉన్నాడు, ఇంకా రెండు గెంటలా, పర్లేదులే, మాకు మూడు గెంటలు పడుతుంది, ఓకే...ఓకే"*** అనేసి ఫోను పెట్టేసారు. నాకర్థమయ్యిందల్లా ఒక్కటే. ఇక్కడ ఇంకా మూడు గెంటలుండాలని. ఒక్కసారి మా ఆవిడకి ఫోను చేసుకుంటాను, లేకపోతే ఆవిడ బెంగపెట్టుకుంటుందని ప్రాధేయపడ్డా, - ఆవు పులి కథలో ఆవు లాగ. ఆయన వినలేదు.

***"ఫర్లేదులేవోయ్, ఒఖ్ఖరోజుకి ఏహేవీ అయిపోదులే.."*** అనేసి, బుక్ గురించి మాట్లాడడం మొదలెట్టారు.

ఆ ప్రహసనం పూర్తయ్యే సరికి మరో రెండు గెంటలు పట్టింది. అయ్యబాబోయ్, ఆరయిపోయింది. నా ఓపికంతా ఆవిరైపోయింది. సివరాకరికి, ఆయన కనికరించి, డ్రెస్సు మార్చుకుని వచ్చి,

***"పదవోయ్, ఒక మాటు మీ ఇంటికొచ్చి, మీ ఆవిణ్ణీ, పిల్లలనీ పలకరించొస్తాను, నువ్వు కూడా వస్తే, బావుంటుంది"*** అన్నారు నవ్వుతూ.

నాకింక నవ్వే ఓపిక లేక, విరక్తిగా ఓ లుక్కిచ్చి, కారులో పడ్డా. ఆయన కారువెనకాల ఫాలో అవుతూ, మాయింటి కొచ్చా. మా ఇంట్లో లైట్లు వేసి లేవు. మా ఇంటికి ఇటు పక్క, అటు పక్క ఇళ్ళముందు, ఓ యాభై కార్లు పార్కు చేసేసి ఉన్నాయి, ఒకదానిమీద ఒకటి. తలుపు దెగ్గిరికొచ్చి నీరసంగా బెల్లు నొక్కా. మా తలుపు దానంతట అదే

తెరుచుకుంది. లైట్లు వెలిగాయి. పేద్ద పెట్టున అందరూ కలిసి ***"స..ర్..ప్రై..జ్.."*** అని అరిచేసి, నన్ను లోపలికి లాక్కెళ్ళిపోయారు.

అలా దొర్లుకుంటూ బేస్‌మెంట్‌లోకి వెళిపోయా. అక్కడంతా మయసభలా అలంకరించి ఉంది. ఎక్కడ చూసినా నలభై, నలభై అనే సౌండే వినబడుతోంది. ఇంతలో మా ఆవిడొచ్చింది. ఆవిడ చెయ్యి మెరిసిపోతోంది. అవును మరి, విష్ణుమూర్తి వీపు మీది శ్రీవత్సమంత సైజులో ఉంది ఆవిడ డైమండ్ రింగు.

వస్తూనే నా వేలికి ఒక ఉంగరం తొడిగింది. ***"హేపీ బర్త్‌డే తాతగారూ.."*** అంటూ.

ఆవిడ ఫ్రెండ్సంతా ***"డైమండ్ రింగ్ గిఫ్ట్, డైమండ్ రింగ్ గిఫ్ట్"*** అని గుసగుసలాడుకుంటున్నారు.

ఆవిడదేమో అనుకున్నా. కాదు, నాదిట !! నేను అనుమానం వచ్చి వేలు చూసుకున్నాను. రింగే ఉంది, డైమండు లేదు. ***"ఇదేవిటే"*** అని అడిగాను దీనంగా.

***"పల్లవీ, పైనించి భూతద్దం పట్రామ్మా"*** అంది. అది పట్టుకొచ్చింది. అది పెట్టి చూస్తే అప్పుడు కనబడింది నా డైమండు.

***"కనీసం జయప్రద బ్యూటీ స్పాటంతైనా లేదు, ఇదేం డైమండే.."*** అన్నాను ఆందోళనగా.

***"మీ మొహం, మొగాళ్ళెవరూ పెద్ద డైమండు పెట్టుకోరు. తెలియదూ, చెబితే వినరూ... చూడండి, ఎం...త బావుందో..."*** అంది ఓ కన్ను నా రింగు మీదా, ఓ కన్ను తన రింగు మీదా వేసి.

***"బావుంది, బావుంది, అద్దిరిపోయింది, టూ..మచ్చి"*** అనేసారు, ఆవిడ ఏర్పాటు చేసిన ఫ్రెండు మేళవంతా. ఆ తరవాత ఓ వీడియో స్లయిడు ప్రెజెంటేషన్ జరిగింది. నేను తొలి బర్త్‌డే డ్రెస్సులో ఉన్నప్పటి నుంచీ, ఆవేళ్టివరకూ తీసిన చిత్ర రాజములను పబ్లిక్‌గా ప్రదర్శించేసి, చేతులు దులిపేసుకున్నారు, అందరూ. ఆనక రెండు కేకులు తెచ్చి, ఒహటి నా మొహానికి పులిమేసి, రెండోది కట్ చేయించేసారు. ఇంతలో మా ఫ్రెండు గారి భార్య కనబడి

***" దండి, అందరూ భోంచేద్దాం. ఈ ఫది ఐటెంసూ నేనే వండాను, స్వీటుకూడా నాదే, తిని చెప్పండి ఎలా ఉందో.."*** అన్నారు నవ్వుతూ. అప్పుడర్థవయింది, వాళ్ళాయన నన్ను ఎనిమిది గెంటలు ఎందుకు నంచుకున్నారో, అంతసేపూ ఆవిడ ఎక్కడికి మాయవయ్యారో.

చేసేందుకేమీ లేక భోజనం చేసా అందరితో కలిసి. అందరూ చేతులు పిసికేసి, గిఫ్ట్ కార్డులిచ్చేసి, వెళ్ళడానికి సిద్ధమౌతున్నారు. అప్పుడు మా ఆవిడ ఓ పేద్ద ఫొటో ఫ్రేము పట్టుకొచ్చింది. ఆవిడ నాకోసం రాసిన కవితట. నేను ఎక్కడేనా పారేస్తానేమోనని, ఫ్రేము కట్టించి మరీ తెచ్చింది. చదువుతుందేమోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని

చూస్తున్నాను, పిల్లిలా. ఆవిడ అంది. ***" ఇవి నా భావాలు. నేను చెబితే, మా ఫ్రెండు రాసింది. మీరే చదవండి.."*** అంటూ నా చేతికిచ్చింది. ఛచ్చింది గొర్రె. విధి లేక చదివాను.

***" ఏవండీ..***
***మీరుంటే చాలండీ ఇంకేమీ వద్దండీ***
***మీరు నా పిల్లల తండ్రీ మీవూరు రాజమండ్రీ***
***మీ కోసం వండీ వండీ నా నడుం వంగిందండీ***
***అయినా పర్లేదండీ ఇదినా ధర్మవండీ***
***మీకిప్పుడు ఫార్టీ అండీ అందుకే మీకు ఈ పార్టీ అండీ***
***మీకు హేపీ బర్త్‌డే అండీ మెనీ మెనీ హేపీ రిటర్న్స్ అండీ.."***

మీరు నమ్మండి, నమ్మకపొండి, ఇంక నా వల్ల కాలేదు. ఎందుకేనా మంచిదని మా ఆవిడకేసి చూసా. ఆవిడ కొంచెం ఎమోషనల్ అయింది. కవితతో మమేకం అయిపోయింది. నా అదృష్టం బావుండి కవిత అక్కడితో పూర్తయిపోయింది. మా ఆవిడ కన్నీళ్ళు తుడిచి, దగ్గరకు తీసుకుని, బహుదూరపు బాటసారిలా, సీలింగ్ కేసి చూస్తూ ఓ ఫోజెట్టా, లేని కళ్ళజోడు సద్దుకుంటూ. అందరూ ఫొటోలు నొక్కేసారు. ఆ...వ్ అని బుగ్గలు నొక్కుకుంటూ. ఆనక అందరూ మెల్లగా నిష్క్రమించారు. రెండు నిమిషాల్లో ఈ విశేషాలన్నీ ఫేస్‌బుక్‌లో ఎక్కించేసారు. మర్నాడు ఓ వంద మెసేజిలున్నాయి ఫేస్ బుక్ లో. ***"నీ పుట్టిన రోజు బా....ఘా...జరుపుకున్నావా? మమ్మల్ని పిలవనందుకు థేంక్స్.."*** అనుకుంటూ. మా ఆవిడ మీద కోపం వచ్చింది. కానీ అది మాత్రం ఏం చేస్తుంది? పిలవడవంటూ మొదలెడితే మా వూళ్ళో ఒక్ఖడూ మిగలడు మరి, అంతమంది స్నేహితులున్నారు అయాంబాబుగారికి. ఇలా గర్జించకుండానే నలభైల్లోకొచ్చేసాను. క్రెడిట్ కార్డు బిల్లు చూసుకుని ఆనందపడ్డా, నలభయ్యో పుట్టినరోజు జీవితంలో ఒక్ఖసారే చేస్తారు కాబట్టి.

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS